ముమ్మరంగా ఈ-పంట నమోదు

చింతలపూడి: చింతలపూడి నియోజకవర్గంలో ఈ పంట నమోదు ప్రక్రియను వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ముమ్మరంగా చేపట్టారు. సెప్టెంబర్ 15 నాటికి ఈ పంట నమోదు పూర్తి చేయాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో ఈ పంట నమోదు ముమ్మరంగా చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ కావడంతో వరితో పాటు మొక్కజొన్న, ఉద్యాన పంటలను ఈ పంటలో నమోదు చేస్తున్నారు. చింతలపూడి నియోజకవర్గంలో వరితో పాటు, మొక్కజొన్న, వేరుశనగ, మిర్చి, చెరకు, అరటి, కూరగాయల పంటలు, ఆయిల్‌పాం, నిమ్మ, మామిడి, జీడిమామిడి పంటలను రైతులు విస్తారంగా పండిస్తున్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు, రాయితీలు వర్తించాలంటే ఈ పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించి పంట నష్టం జరిగినప్పుడు రైతులకు ఈ క్రాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. నియోజకవర్గంలో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 1,13,332 ఎకరాల్లో ఈ పంట నమోదు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 37,094 ఎకరాల్లో ఈ పంట నమోదు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. ఇందులో మండలాల వారీగా చూస్తే చింతలపూడి మండలంలో 41 వేల ఎకరాలకు గాను ఇప్పటివరకు 9,285 ఎకరాల్లో ఈపంట నమోదు పూర్తి చేశారు. జంగారెడ్డిగూడెం మండలంలో 28 వేల ఎకరాలకు 10,500 ఎకరాల్లో , కామవరపుకోట మండలంలో 27,332 ఎకరాలకు 10,459 ఎకరాలు, లింగపాలెం మండలంలో 17 వేల ఎకరాలకు 6,850 ఎకరాల్లో ఈపంట నమోదు ప్రక్రియ పూర్తయ్యింది.





చింతలపూడి మండలంలో ఈ పంట నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు, ఎండీ షాఫియ, ఉద్యానాధికారి

ప్రయోజనాలివే..

ఈ పంట నమోదుకు కావలసిన దరఖాస్తులు, ఉపయోగాలను గురించి ఉద్యానాధికారిణి ఎండి షాఫియ ఈ సందర్భంగా తెలిపారు. ఈ పంట నమోదుకు రైతులకు పొలం పాస్‌బుక్ లేదా కౌలు కార్డు. ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ అవసరమవుతాయి.

- ఈ పంట నమోదు చేసుకోవడం ద్వారా రైతులు వ్యవసాయ, ఉద్యానశాఖల ద్వారా అందించే అన్నిరకాల సంక్షేమ పథకాలకు అర్హులవుతారు.
- ధాన్యం విక్రయించడానికి ఈ పంట నమోదు తప్పనిసరి
- ఎస్సీ, ఎస్టీ,, బీసీ, మైనారిటీ రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద లబ్ధి పొందవచ్చు.
- పంట నష్టాలతో పాటు, బ్యాంకులో వ్యవసాయ ఆధారిత రుణాలు, వడ్డీ లేని రుణాలు పొందవచ్చు.
- సబ్సిడీపై ప్రభుత్వం అందించే ఎరువులు, విత్తనాలు పొందవచ్చు, డ్రిప్, స్ప్రింక్లర్లు పొందవచ్చు.

క్లుప్తంగా

ప్రజల పక్షాన పోరాడండి



మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన కంభం విజయరాజు

చింతలపూడి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంప్ కార్యాలయంలో పార్టీ అధినేతను కలిసి నియోజకవర్గంలోని పార్టీ పరిస్థితిపై విజయరాజు వివరించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు పోరాటాలు సాగించాలని సూచించినట్లు తెలిపారు. కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆదేశించినట్లు చెప్పారు.

బాలుడికి ఆర్థిక సహాయం



నగదు అందజేస్తున్న సహాయ ఫౌండేషన్ సభ్యులు

కామవరపుకోట: ఆడమిల్లి గ్రామానికి చెందిన గూట్ల ఆనందరావు కుమారుడుకి అనారోగ్యంగా ఉండటంతో వైద్య చికిత్స నిమిత్తం సహాయ ఫౌండేషన్ సభ్యులు రూ.13,700 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా బాలుడి కుటుంబ సభ్యులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ సలహాదారులు టీవీఎస్ రాజు పాల్గొన్నారు.

టైరు పంక్చరై ట్రాక్టర్ బోల్తా



వెంకటాపురం గ్రామ సమీపంలో బోల్తా పడిన ట్రాక్టర్

కుక్కునూరు: సిమెంట్ బ్రిక్స్ లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. స్థానికులు చెప్పిన వివరాలు ఇలా ఉన్నాయి, గురువారం సాయంత్రం భూర్గంపాడు నుంచి వెంకటాపురం వైపు సిమెంట్ బ్రిక్స్‌తో వస్తున్న ట్రాక్టర్ వేలేరు ముత్యాలమ్మ గుడి దాటిన తరువాత వాహనం ముందు టైర్ పంక్చర్ కావడంతో ఒక్కసారిగా అదుపు తప్పి రోడ్డు పక్కకి పల్టీలు కొట్టింది. డ్రైవర్ అప్రమత్తమై వాహనం నుంచి దూకడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ ప్రమాదం జరిగిన సమయంలో ట్రాక్టర్‌కు ఎదురుగా ఎటువంటి వాహనం రాకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు చెప్పారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు



పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా టీకాలు వేస్తున్న సిబ్బంది

కుక్కునూరు: పశువులలో ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నివారణకు పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో టీకాలు వేసే కార్యక్రమాన్ని మండలంలో ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గురువారం వెటర్నరీ సిబ్బంది పాడిరైతుల ఇళ్ల వద్దకు వెళ్లి పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా సిబ్బంది మాట్లాడుతూ, ఈ వ్యాధి సోకితే చికిత్సలేదని పశువులకు ముందుస్తుగా టీకాలు వేయించి పశువులకు వ్యాధి సోకకుండా పాడిరైతులు జాగ్రత్తపడాలని సూచించారు.

వీధికుక్కల దాడిలో మానుపిల్లి మృతి



ద్వారకానగర్‌లో వీధికుక్కల దాడిలో మృతి చెందిన మాను పిల్లి

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధిలోని ద్వారకానగర్‌లో గురువారం ఉదయం వీధికుక్కల దాడిలో పునుగు పిల్లిని పోలిన ఒక జంతువు మృతి చెందింది. అది పునుగు పిల్లి అనుకుని దాన్ని చూసేందుకు చుట్టుపక్కల వారు అక్కడికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. స్థానికులు అందించిన సమాచారంతో అటవీశాఖ భీమడోలు సెక్షన్ అధికారి శ్రీనివాస్ ఘటనా స్థలానికి చేరుకుని జంతువు మృతదేహాన్ని పరిశీలించారు. అయితే అది పునుగు పిల్లి కాదు.. మాను పిల్లి అని నిర్ధారించారు. వీఆర్వో సత్యన్నారాయణ సమక్షంలో పంచనామా నిర్వహించి, మాను పిల్లి మృతదేహాన్ని శ్మశానవాటికలో ఖననం చేశారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

జంగారెడ్డిగూడెం: రెండు వేర్వేరు ఘటనల్లో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌లను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాపై అందిన సమాచారం మేరకు మండలంలోని మైసన్నగూడెం గ్రామశివారులో పోలీసులు తనిఖీలు చేశారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా రెండు ట్రాక్టర్‌లలో జల్లేరు వాగు నుంచి ఇసుక తరలిస్తుండగా, ట్రాక్టర్‌లను పట్టుకుని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సీహెచ్ కోటేశ్వరరావు చెప్పారు. అలాగే మండలంలోని పంగిడిగూడెం శివారు జల్లేరు వాగునుంచి ఇసుకను తరలిస్తున్న మరో రెండు ట్రాక్టర్‌లను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు.

వైభవంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

జంగారెడ్డిగూడెం: పట్టణంలో గోకుల తిరుమల పారిజాతగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం కొండ దిగువన అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ గురువారం వైభవంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెంకు చెందిన కానూరు శ్రీనివాస్ దంపతులచే నిర్మించబడిన 39 అడుగుల అభయాంజనేయస్వామి వారి విగ్రహన్ని వేదమంత్రోచ్చారణ నడుమ, పట్టణ ప్రముఖులు, భక్తుల సమక్షంలో ప్రారంభించారు. స్వామి వారి పాదాల చెంత రెండు అడుగుల అభయ ఆంజనేయ స్వామి వారి శిలా మూర్తిని ఉదయం 8:35 నిమిషాలకు మంగళ వాయిద్యాలు, భక్తుల జైశ్రీరామ్ నినాదాల మధ్య వైభవంగా ప్రతిష్ఠించారు. అనంతరం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ బైక్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లను ఈవో మాణికల రాంబాబు పర్యవేక్షించారు. ప్రతిష్ఠ వైదిక కార్యక్రమములను పారిజాతగిరి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరు రవికుమార్ ఆచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ, జెడ్పీటీసీల ఛాంబర్ జిల్లా అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి, వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ పరిశీలకులు జెట్టి గురునాథరావు, సీనియర్ నాయకులు మండవల్లి సోంబాబు, నంబూరి రామచంద్రరాజు, రావూరి కృష్ణ, గొల్లపూడి శ్రీదేవి, మండవ లక్ష్మణరావు, మున్సిపల్ కమిషనర్ నరేంద్రకుమార్, ఎస్సై జ్యోతిబాస్, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ దిగువన అభయాంజనేయస్వామి విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం →



నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పర్రెడ్డిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఈఈ రాధాకృష్ణ తెలిపారు. పర్రెడ్డిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ లైన్ మీద చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ సబ్ స్టేషన్ పరిధిలోని లక్ష్మీగణపతి టౌన్ షిప్, న్యూ బస్టాండ్, ఏలూరు రోడ్డు, మారుతి నగర్, సూర్య కాలేజీ రోడ్డులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. అలాగే లక్కవరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని ఫీడర్స్ దేవులపల్లి, గురవాయిగూడెం, లక్కవరం, నిమ్మలగూడెం అమ్మపాలెంలలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. కావున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

నేడు జీలుగుమిల్లిలో విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

జంగారెడ్డిగూడెం: సీజీఆర్‌ఎఫ్, ఏపీఈపీడీసీఎల్ ఆధ్వర్యంలో జీలుగుమిల్లి విద్యుత్ సబ్ డివిజన్ నందు గల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు వారి కార్యాలయంలో శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించబడుతుందని జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ ఈఈ పి.రాధాకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమానికి సీజీఆర్‌ఎఫ్ చైర్‌పర్సన్ డా.బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు డా. ఆర్.సురేంద్ర కుమార్ పాల్గొంటారని రాధాకృష్ణ తెలిపారు.

నేడు పారిజాతగిరిలో వరలక్ష్మి వ్రత పూజలు

జంగారెడ్డిగూడెం: స్థానిక గోకుల తిరుమల పారిజాతగిర శ్రీవేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈనెల 23వ తేదీ ఉదయం 10 గంటలకు సామూహిక వరలక్ష్మి వ్రత పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో మానికల రాంబాబు తెలిపారు. కావలసిన పూజా ద్రవ్యములు అన్నీ ఆలయంలోనే సమకూరుస్తామని, పూజా కార్యక్రమం అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఉంటుందని, భక్తులు పాల్గొనాల్సినందిగా కోరారు.

నేడు ప్రత్యేక గ్రామ సభలు

ద్వారకాతిరుమల: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వద్ద శుక్రవారం ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ తిరుపతిరావు తెలిపారు. అందులో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సీహెచ్ పోతేపల్లి, నారాయణపురం, తిరుమలంపాలెం, ఐఎస్ జగన్నాధపురం, జి.కొత్తపల్లి, ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం, రాళ్లకుంట, దొరసానిపాడు, ఐఎస్ రాఘవాపురం, మద్దులగూడెం, ద్వారకాతిరుమల, పి.కన్నాపురం, జాజులకుంట గ్రామాల్లో జరుగుతుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి కోడిగూడెం, బుట్టాయిగూడెం, మారంపల్లి, రాజుపాలెం, వేంపాడు, గుణ్ణంపల్లి, కొమ్మర, తిమ్మాపురం, గుండుగొలనుకుంట, రామసింగవరం, వెంకటకృష్ణాపురం, రామన్నగూడెం, సత్తాల, గొల్లగూడెం గ్రామాల్లో ఈ గ్రామ సభలను నిర్వహిస్తామన్నారు.

కొయ్యలగూడెం: మండల వ్యాప్తంగా పదిహేడు పంచాయతీల పరిధిలో శుక్రవారం ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో జి.సతీష్ పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలోని కార్యాలయాలు, సచివాలయాల భవనాల్లో ఉదయం, మధ్యాహ్నం వేళల్లో సభలు నిర్వహిస్తామన్నారు.

రిజర్వేషన్లపై రాజకీయాలు మానుకోవాలి

కామవరపుకోట: ఎస్సీ రిజర్వేషన్లపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయాలు మానుకోవాలని అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ అన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ గురువారం మండలంలో అంబేద్కర్ ఇండియా మిషన్, మండల జేఏసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొత్తూరు బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎయిమ్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్ మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఇచ్చిన వర్గీకరణ తీర్పు మాలలకు వ్యతిరేకంగా, వారిని అణచివేసే విధంగా ఉందన్నారు. క్రిమిలేయర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిమ్ మండల సభ్యులు మాంద్రు లాజరు, డేవిడ్, కొప్పుల రామకృష్ణ, మాల మహానాడు మండల సభ్యులు మాదాసి రాంబాబు, కె.భాగ్యరాజ్, పోలిలమెట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తూరు బస్టాండ్ ఎదురుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం సెజ్ మృతులకు సంతాపం

జంగారెడ్డిగూడెం: అచ్యుతాపురం ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతులకు రూ.2 కోట్లు నష్ట పరిహారం ఇవ్వాలని ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ డిమాండ్ చేశారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన 18 మంది ఉద్యోగ కార్మికులకు ఇఫ్టూ ఆధ్వర్యంలో గురువారం మార్కెట్ యార్డులో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కేవీ రమణ మాట్లాడుతూ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ఏరియాలో ఉన్న ఫార్మా కంపెనీల్లో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని ఆ మృతుల మరణానికి ప్రభుత్వం, కంపెనీ యాజమాన్యాలు బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అన్ని ఫ్యాక్టరీలలో బాయిలర్లకు, ఇతర మెషీనరీలకు, కార్మికుల పనిచేసే ప్రదేశానికి సేఫ్టీ పరికరాలు ఉన్నాయో లేదో తనిఖీ చేయాలని, ప్రతి సంవత్సరం మెషీనరీ మీద తనిఖీ చేసే సేఫ్టీ అధికారులు సక్రమంగా తనిఖీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రమణ డిమాండ్ చేశారు.



ప్రమాద బాధితులకు న్యాయం చేయాలని నినదిస్తున్న ఇఫ్టూ నాయకులు

మానవ మృగాలను వెంటనే శిక్షించాలి

చింతలపూడి: కోల్‌కతా జూనియర్ మహిళ వైద్యురాలిపై హత్యాచారం చేసిన మానవ మృగాలను వెంటనే అరెస్ట్ చేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి శిక్ష అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఐటీయూ కేంద్ర కమిటీ పిలుపు మేరకు చింతలపూడి పట్టణ కేంద్రంలో ఫైర్‌స్టేషన్ సెంటర్ కూడలి వద్ద సీఐటీయూ అనుబంధ సంఘాలైన మెప్మా, ఐకేపీ, మున్సిపల్ రంగాలకు సంబంధించిన మహిళా కార్మికులు నిరసన తెలియజేశారు. సంఘటన జరిగి 15 రోజులు కావస్తున్నా నేటికీ ఈ దారుణ ఘటనపై బెంగాల్ రాష్ట్ర ప్రభుత్వంగానీ, కేంద్ర ప్రభుత్వం గానీ దోషులను అరెస్టు చేయడంలో వెనుకంజ వేస్తున్నాయని మెప్మా జిల్లా నాయకురాలు వి.ఝాన్సీరాణి అన్నారు. ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఇలాంటి ఘటనలు దేశంలో ఎక్కడా జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ సీనియర్ నాయకులు సూర్యకుమార్, ఐకేపీ జిల్లా నాయకురాలు ఆమని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, జస్సిత, నాగమణి, సంకు జోషి, డి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో నిరసన తెలుపుతున్న సీఐటీయూ, అనుబంధ సంఘాల నాయకులు

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలి

కుక్కునూరు: మిషన్ వాత్సల్య పథకం ద్వారా నగదు పొందిన పిల్లలను బాగా చదివించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని డీసీపీఓ కార్యాలయ సిబ్బంది రాజ్‌కుమార్, రాజేష్ తెలిపారు. గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకంపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీసీపీఓ కార్యాలయ సిబ్బంది పథకం గురించి పిల్లల తల్లులకు, సంరక్షులకు వివరించారు. పథకంలో భాగంగా రూ.24 వేలు అందించడం పట్ల పిల్లల తల్లులు, సంరక్షులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ ఎస్ లక్ష్మీకుమారి, సూపర్‌వైజర్‌లు మయూరి, రుక్మిణి, మహిళా పోలీస్ కామాక్షి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీఓ సిబ్బంది

నూతన కార్యవర్గం ఎన్నిక

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం డిపో ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన విస్తృతస్థాయి జనరల్ బాడీ సమావేశంలో యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.పాండురంగారావు, కార్యదర్శిగా సీహెచ్‌ఎస్ నారాయణ, ట్రెజరర్‌గా కె.ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె.నాగమల్లేశ్వరరావు, సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి అధ్యక్షుడిగా రంగనాయకులు వ్యవహరించగా ముఖ్యఅతిథిగా ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, అమరావతి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ కమిటీ) జనరల్ సెక్రెటరీ పలిశెట్టి దామోదర్‌రావు హాజరయ్యారు. సమావేశంలో ప్రస్తుతం ఏపీపీటీడీలో ఉన్న సమస్యలు, డిపోలో ఉన్న సమస్యలపై సభ్యులతో చర్చించారు.



జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో ఎంప్లాయీస్ యూనియన్ నూతన కార్యవర్గం

కువైట్ నుంచి స్వదేశానికి క్షేమంగా..

ఏలూరు (మెట్రో): బతుకుదెరువు కోసం కువైట్ వెళ్లి అక్కడ అవస్థలు పడుతున్న ఓ మహిళ జిల్లా అధికారులు, నాయకుల చొరవతో సురక్షితంగా స్వదేశానికి చేరుకుంది. వివరాలిలా ఉన్నాయి. బుట్టాయగూడెం మండలం మర్లగూడెంకు చెందిన తాటి సుంకరమ్మ ఉపాధి నిమిత్తం కువైట్ దేశానికి వెళ్లింది. అయితే అక్కడ యజమానులు పెట్టే వేధింపులు తాళలేక తన బాధలను తెలుపుతూ సెల్ఫీ వీడియో తీసి జిల్లాకు చెందిన నాయకులకు పంపించింది. దీనిపై పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టా మహేష్ యాదవ్‌లు జిల్లా అధికారులకు రాతపూర్వకంగా సమాచారాన్ని అందించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ వెట్రిసెల్వి తాటి సుంకరమ్మను స్వదేశానికి రప్పించేందుకు డీఆర్వో పుష్పమణికి, మహిళా శిశుసంక్షేమ శాఖ అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. డీఆర్‌వో పుష్పమణి కువైట్ ఎంబసీ అధికారులతో, అదే విధంగా భారత్ ఎంబసీ అధికారులతో సంప్రదింపులు జరిపి సంకురమ్మను క్షేమంగా స్వదేశానికి రప్పించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను సుంకరమ్మ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. సంకురమ్మ సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చేందుకు కృషి చేసిన డీఆర్వో పుష్పమణి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులను కలెక్టర్ అభినందించారు. స్వదేశానికి తిరిగి వచ్చేందుకు చర్యలు తీసుకున్న అధికారులు, నాయకులకు ఈ సందర్భంగా సంకురమ్మ కృతజ్ఞతలు తెలిపింది. అదేవిధంగా సంకురమ్మ కోరిక మేరకు రేషన్‌కార్డు, ఉండేందుకు గృహనిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెట్రిసెల్వి భరోసా ఇచ్చారు.



కలెక్టర్ వెట్రిసెల్వికి, అధికారులకు కృతజ్ఞతలు తెలుపుతున్న సంకురమ్మ

పోలవరంలో 41 శాతం ఈ పంట నమోదు

పోలవరం రూరల్: పోలవరం మండలంలోని రైతు సేవా కేంద్రాలన్నింటిలో ఈ పంట నమోదు కార్యక్రమం జరుగుతుందని వ్యవసాయ అధికారి కె.రాంబాబు గురువారం తెలిపారు. మండలంలోని రైతులు అందరూ రైతు సేవా కేంద్రంలో వారు సాగు చేసిన పంటల వివరాలు, పంట రకాలు, తదితర వివరాలు అందజేసి ఈ పంట నమోదు చేయించుకోవాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 4625 ఎకరాలు వరికిగాను 1709 ఎకరాల్లో పంట నమోదు కార్యక్రమం పూర్తయిటన్లు చెప్పారు. మినుములు 414 ఎకరాలు ఈ పంట నమోదు పూర్తయ్యిందన్నారు. ఈ పంట నమోదు వల్ల పంటల బీమా, ధాన్యం కొనుగోలు ఇంకా ప్రభుత్వం నుంచి అందే అనేక ప్రయోజనాలు అవకాశం ఉంటుందన్నారు. కాగా మొత్తంగా మండలంలో 41 శాతం వరకు ఈ పంట నమోదు అయినట్లు ఏవో తెలిపారు.



పోలవరంలో ఈ-పంట నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

అక్రమ లేఅవుట్ వేస్తే చర్యలు

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో అక్రమ లేఅవుట్‌లు వేసి విక్రయించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ రాజు గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. వినియోగదారులు ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసే సమయంలో లేఅవుట్‌కు అనుమతులు ఉన్నాయో లేదో సరిచూసుకుని, ఆ తరువాత మాత్రమే కొనుగోళ్లు చేపట్టాలన్నారు. అనుమతులు లేని లేఅవుట్‌లలో ఇళ్ల స్థలాలు కొనుగోలు చేస్తే, సదరు స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు గాని, మంచినీటి కుళాయిల మంజూరుకు గాని నగర పంచాయతీ ఎటువంటి అనుమతులు ఇవ్వడం జరగదని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు ఇంటి స్థలాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అలాగే అక్రమంగా లేఅవుట్ వేసినవారిపై పురపాలక చట్టం 1965 ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లా పోలవరం పోలీస్ సబ్ డివిజన్‌లో ప్రజల శాంతిభద్రతల పరిరక్షణతోపాటు, ప్రజలకు మెరుగైన రీతిలో సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ చెప్పారు. పోలవరం సబ్‌డివిజన్ పోలీస్ అధికారిగా ఎం.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఏలూరులోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పూలకుండీని అందజేశారు. ఏలూరు ఇంటిలిజెన్స్ డీఎస్పీగా పనిచేసిన వెంకటేశ్వరరావు సాధారణ బదిలీల్లో భాగంగా పోలవరం డీఎస్పీగా బదిలీపై వచ్చారు.

పోలవరం రూరల్: పోలవరం సబ్ డివిజనల్ పోలీస్ అధికారిగా ఎం.వెంకటేశ్వరరావు బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఇంటెలిజెన్స్ డీఎస్పీగా పనిచేస్తూ సాధారణ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ సురేష్‌కుమార్ రెడ్డి బదిలీపై వెళ్లారు. కాగా బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ వెంకటేశ్వరరావును పోలవరం సీఐ జి.మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.



ఎస్పీ ప్రతాప శివకిషోర్‌ను కలిసిన పోలవరం డీఎస్పీ వెంకటేశ్వరరావు

మృతదేహంతో గ్రామస్తుల ఆందోళన

లింగపాలెం: భర్తను మరో వ్యక్తితో కలిసి భార్య హత్య చేసిందంటూ మఠంగూడెం గ్రామస్తులు గురువారం ఆందోళన చేశారు. చింతలపూడి రహదారిపై మృతదేహంతో ఆందోళన చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం గ్రామానికి చెందిన గొల్లపల్లి నాగరాజు మృతిచెందాడు. నాగరాజు మృతికి అతని భార్య సౌందర్య కారణమని, మరో వ్యక్తితో కలిసి నాగరాజుకు ఉరివేసి హత్య చేసిందని బంధువులు ఆరోపించారు. మృతదేహంతో రోడ్డుపై ఆందోళన చేస్తూ మృతుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. నాగరాజు భార్యను అదుపులోకి తీసుకున్నారు.



గొల్లపల్లి నాగరాజు మృతదేహం